చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని వర్మ శివపంచాయత యాగం - 7లో
పారిశుధ్య కార్మికుల ఆందోళన - 7లో
సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం - 7లో

కోళ్ల కొట్లాటకు.. రంగం సిద్ధం!



కోళ్ల.. కొట్లాటకు సర్వం సిద్ధమైంది. కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతంతోపాటు పలుచోట్ల కోడిపందాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇందుకు తగ్గట్టుగా బరులు సిద్ధమయ్యాయి. కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించినా పందెంరాయుళ్లు వెనక్కితగ్గడం లేదు. ఎక్కడికక్కడ పందాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. దీనికి రూ.లక్షల్లో వేలం పాటలకు ఖర్చుపెట్టగా ఇక రూ.కోట్లలో పందాలు జరగనున్నాయి.

- జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కోడిపందాలకు ఏర్పాట్లు పూర్తి
- జూదాల నిర్వహణకు లక్షల్లో వేలం.. కోట్లలో పందాలు
- కోడిపందాలు, గుండాటలకు భారీగా బరులు రెడీ

కరప మండలం వేళంగిలో పందేలు, గుండాటకు సిద్ధమవుతున్న బరి



పెదపూడి మండలం చింతపల్లిలో కోడిపందాలకు సిద్ధమవుతున్న బరి

పిఠాపురం, జనవరి 13: పిఠాపురం నియోజకవర్గంలో కోడిపందాలను భారీస్థాయిలో నిర్వహించేందుకు పందెంరాయుళ్ల సన్నద్ధమవుతున్నారు. పిఠాపురం పట్టణంతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం నుంచి భారీఎత్తున పందాలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. గతంలో పందాలు నిర్వహించిన బరులవద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పిఠాపురం పట్టణ శివారులోని ఒక లేఅవుట్‌లోనూ, నియోజకవర్గంలోని మిగిలిన గ్రామాల్లోనూ బరులు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ గుండాట, జూదం, మద్యం విక్రయాలకు బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క గుండాట బోర్డుకు రూ.2లక్షలు నుంచి రూ.6లక్షలు వరకూ పలకడం గమనార్హం.

జగ్గంపేటలో రూ.5కోట్ల పందానికి సిద్ధం

జగ్గంపేట, జనవరి 13: మెట్టప్రాంతమైన జగ్గంపేటలో కోడిపందాల బరిలో రోజుకు 20 జోడీల చొప్పున మూడు రోజులకు 60 జోడీల కాళ్లను పందానికి ఇరువైపుల నుంచి కలుపుకున్నారు. 60 జోడీల మీద రూ.2కోట్ల పందాలు ఉన్నాయి. దీంతోపాటు గుండాట నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. దీనిపైనా రూ.2కోట్ల పందాలు జరుగుతున్నాయి. జగ్గంపేటలోనే రూ.4కోట్ల పందాలు నడుస్తున్నాయి. పెద్దాపురం, ప్రత్తిపాడు, తుని, పిఠాపురం, కాకినాడ, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాల ముసుగులో భారీగా జూదాలు నిర్వహిస్తున్నారు. ఈ జూదాలు నిర్వాహకులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. గుండాటకు ఐదు బల్లలు వేశారు. కనుమ రోజున రావులమ్మ సంబరం కావడంతో అదనంగా మరిన్ని పందాలు నిర్వహించాలని నిర్ణయించారు. జగ్గంపేటతోపాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో రూ.5కోట్ల మేర పందాలు నడుస్తున్నాయి.

మెట్టలో రాజకీయ వేడి

తుని రూరల్, జనవరి 13: ఒకపక్క ఎన్నికలవేడి, మరోపక్క సంక్రాంతి సంబరాలతో మెట్టలో తుని పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎన్నికల సమయం కావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఈ పందాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని తమ మార్క్‌ను ప్రదర్శించగలుగుతున్నారు. ఇప్పటికే మెట్టలో ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేయగా కొన్నిచోట్ల పందాలు ప్రారంభమయ్యాయి.

తాళ్లరేవులో బరులు రెడీ

తాళ్లరేవు, జనవరి 13: మండలంలో పలుచోట్ల కోడిపందెం బరులను వైసీపీ నాయకులు సిద్ధం చేస్తున్నారు. పోలీసులు అనుమతులు లేవంటూనే బందోబస్తు నిర్వహిస్తున్నారు. సుంకరపాలెంలో మూడు, చొల్లంగిపేట, పటవల, గాడిమొగ తదితర ప్రాంతాల్లో కోడిపందెం బరులు సిద్ధమవుతున్నాయి.

కరపలో పందాలు సిద్ధం

కరప, జనవరి 13: మండల గ్రామాల్లో కోడిపందేలు ఆడేందుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేశారు. కరప మండలంలోని గురజనాపల్లి, గొర్రిపూడి, వేళంగి, విజయరాయుడుపాలెం, యండమూరు, వేములవాడ, తదితర గ్రామాల్లో కోడిపందేలు భారీఎత్తున జరగనున్నాయి. ఆదివారం నుంచి నాలుగురోజులపాటు కోడిపందేలు ఆడుకునేందుకు అనధికారిక అనుమతులు లభించినట్టుగా నిర్వాహకులు చెబుతున్నారు.

కాజులూరులో వేలంపాటలు

కాజులూరు, జనవరి 13: కాజులూరు మండలంలోని కాజులూరు, ఆర్యవటం, జగన్నాథగిరి, కుయ్యేరు, కోలంక, పల్లిపాలెం తదితర ప్రాంతాల్లో కోడి పందాల నిర్వహణకు నాయకులు సిద్ధమౌతున్నారు. నేతల సిఫార్సులతో అనధికార ఆటకు రంగం సిద్ధమవుతోంది. కోడి పందాలు, నెంబరు గుండాట నిర్వహణకోసం భారీస్థాయిలో వేలంపాటలు నిర్వహించి లక్షలాది రూపాయలు వసూలు చేశారు. ఆర్యవటంలో రూ.8లక్షలకు వేలంపాట జరిగినట్టు సమాచారం.

పెదపూడిలో భారీగా బరులు

పెదపూడి, జనవరి 13: మండలంలో కోడిపందాలకు 9 బరులు సిద్ధమవుతున్నాయి. రాజుపాలెంలో పందాలకు సిద్ధం చేసిన బరిని పోలీసులు ట్రాక్టర్లతో దున్నించినా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పెదపూడిలోని వేట్లపాలెం రోడ్డులో పేదలకు మంజూరు చేసిన నివాస స్థలాల లేఅవుట్‌లో బరులు సిద్ధం చేశారు.



కాజులూరు మండలం ఆర్యవటంలో హెచ్చరిక ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న పోలీసులు

కోళ్ల పెంపకమే జీవనాధారం

- హాట్ కేక్‌ల్లా అమ్ముడవుతున్న పందెంకోళ్లు



తుని మండలం తేటగుంటలో ఓ నిర్వాహకుడి వద్ద పెరుగుతున్న కోళ్లు

తుని రూరల్, జనవరి 13: మెట్టలో గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల పెంపకం జీవనాధారంగా మారింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంప్రదాయం పేరుతో నిర్వహించే కోడిపందాల్లో కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. పందాల్లో గెలవాలంటే పందెంకోళ్లకు బలిష్టమైన కండలు, చురుగ్గా కదలికలు కలిగి ఉండాలి. ఇందుకు ఆ విధమైన ఆహారాన్ని, శిక్షణ ఇవ్వడం ద్వారా మేలు రకపు పందెంకోళ్లను తయారు చేస్తూ ఆయా కుటుంబాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నాయి. తుని రూరల్, తేటగుంట, రాజుపేట, పోలవరం, ఎస్ఎస్ఈ నగరం తదితర ప్రాంతాల్లో మేలు రకం పందెం కోళ్ల అమ్మకాలు జరుగుతున్నాయి. వీరు జాతికోళ్లను పిల్లలను చేయించి మూడేళ్లపాటు ఆలనాపాలనా చూసి అందుకు అనుగుణంగా కోళ్లకు ఆహారం అందజేసి అన్ని రకాలుగా పందాలకు సిద్ధం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ నాటికి సిద్ధమైన కోళ్లను పందెంరాయుళ్ల చెప్పిన రేట్లకే కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మేలు జాతి పుంజులు లక్షకు పైబడి అమ్మకాలు జరగడంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలనుంచి తేటగుంట పరిసర ప్రాంతాలకు ఖరీదైన కార్లలో చేరుకుని మేలు రకమైన జాతికోళ్లను కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు.

కోడి పందాలకు భారీ ఏర్పాట్లు

- కాకినాడ రూరల్ గ్రామాల్లో భారీస్టేజీలు, టెంట్‌లు ఏర్పాటు



కాకినాడ రూరల్ మండలం గైగోలపాడులో సిద్ధమైన కోడి పందేల బరి

సర్పవరం జంక్షన్, జనవరి 13: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆదివారంనుంచి మూడురోజులపాటు నిర్వహించే కోడిపందేలు, గుండాట, జూదం, మద్యం వ్యాపారం పెద్దఎత్తున సాగేందుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేశారు. సంక్రాంతి సంప్రదాయం పేరుతో కోడి పందాల కోసం ఈ ఏడాది కాకినాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వాహకులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నా ఆంక్షలను భేఖాతరు చేస్తూ రాజకీయ నాయకుల భరోసాతో ఇప్పటికే మండల పరిధిలో సూర్యారావుపేట, కొత్తూరు, నేమాం, వాకలపూడి, వలసపాకల, తిమ్మాపురం, సర్పవరం, గైగోలుపాడు, తూరంగి, చీడిగ, కొవ్వూరు తదితర గ్రామాల్లో కోడి పందేల నిర్వహణ కోసం బరులను సిద్ధం చేశారు. పందేలను తిలకించేందుకు విచ్చేసే ప్రముఖులు, వీఐపీల కోసం భారీ స్టేజీలు, కుర్చీలు, టెంట్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. పందేల కోసం ఇతర ప్రాంతాల నుంచి కోడిపుంజులు ఇప్పటికే వచ్చాయి. లక్షల్లో పందేలు కట్టే వారి కోసం ప్రత్యేక బరులు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల సంక్రాంతి క్రీడా పోటీల పేరుతో బరులు సిద్ధం చేయడం విశేషం. పందెం బరిలో రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు పందెం జరిగేలా కార్పొరేట్ హంగులతో ప్రత్యేక బరులను సిద్ధం చేశారు. ఒక్కో బరిలో రోజుకు 20 పందేలకు తక్కువ కాకుండా ఏర్పాట్లు చేశారు. జోడీ పందేల్లో అధికంగా పందేలు గెలిచిన వాళ్లకు నగదు రూపంలో ప్రైజ్ మనీని ఇవ్వనున్నారు. గతంలో బుల్లెట్‌లు ప్రైజ్ మనీగా ఇచ్చేవారు. పందేలను వీక్షించేందుకు వచ్చే కారుల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని సిద్ధం చేశారు.

భోగి సందడి

- గ్రామాల్లో సంక్రాంతి శోభ
- స్వస్థలాలకు చేరిన వారితో కళకళ
- నేడు భోగి మంటలకు ఏర్పాట్లు



భోగిమంటలకు ఏర్పాట్లు

పిఠాపురం, జనవరి 13: జిల్లాకు సంక్రాంతి శోభ వచ్చింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగరీత్యా స్థిరపడిన వారంతా స్వస్థలాలకు చేరడంతో పల్లెలు, పట్టణాలు కళకళలాడుతున్నాయి. పండుగను ఆనందోత్సాహాలతో కుటుంబసభ్యుల మధ్య గడపనున్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా భోగి మంటలు వేసేందుకు యువకులు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగునాట అత్యంత ప్రాధాన్యం ఉన్న సంక్రాంతి పండుగకు పల్లెలు, పట్టణాలు ముస్తాబయ్యాయి. ఆదివారం భోగి పండుగ, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగను కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిపి జరుపుకునేందుకు జిల్లాలోని ప్రజలు అధిక ప్రాధాన్యమిస్తారు. ఉద్యోగాలు, వృత్తి, వ్యాపారాల రీత్యా దేశంలో ఎక్కడ స్థిరపడిన వారైనా పండుగ మూడురోజులు తమ స్వస్థలాలకు చేరుకుని జరుపుకునేందుకు వీలు చేసుకుంటారు. ఇందు నిమిత్తం నాలుగు నెలలు ముందుగానే సన్నాహాలు ప్రారంభించి బస్సులు, రైళ్లల్లో రిజర్వేషన్లు చేయించుకోవడం సహా ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటారు. శనివారమే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, పూణే, ఢిల్లీ తదితర నగరాలనుంచి జిల్లాకు చాలామంది చేరుకున్నారు.

కుటుంబంతో గడిపేందుకే..

వృత్తి, వ్యాపారులు, ఉద్యోగ ఒత్తిడితో ఏడాది పొడవునా సతమతమయ్యే వారు సంక్రాంతి పండుగ మూడురోజులతోపాటు అదనంగా ఒకటి, రెండు రోజులు సెలవు పెట్టి స్వస్థలాల్లో గడిపేందుకు వస్తూ ఉంటారు. ఇలా సొంత ఊళ్లకు వచ్చిన వారంతా పండుగ సమయంలో కుటుంబంతో గడిపేందుకే అధిక ప్రాధాన్యమిస్తారు. కుటుంబసభ్యులతో కలిసి ఉంటూ బంధుమిత్రులను కలుసుకుంటూ ఆనందంగా గడుపుతారు. పూర్వవిద్యార్థులు, బంధుమిత్రుల కలయికలు ఈ సమయంలోనే ఎక్కువగా చోటుచేసుకుంటాయి.

భోగి మంటలు వేసేందుకు..

గ్రామాలు, పట్టణాలు భేదం లేకుండా ప్రతి కూడలిలోనూ భోగి మంటలు వేస్తూ ఉంటారు. భోగిమంటలకు అవసరమైన కలప, దుంగలను యువకులు సేకరించడంలో నిమగ్నమయ్యారు. వీటిని మంట వేసే ప్రాంతానికి చేరుస్తున్నారు. మంటల్లో వేసేందుకు భోగిపిడకల దండల తయారీలో చిన్నారులు బిజీగా ఉన్నారు. ఉదయం తలస్నానాలు ఆచరించి కొత్త వస్త్రాలు ధరించి భోగిమంటల వద్దకు వెళ్లి పిడకల దండలు వేస్తారు. గ్రామాల్లో ఎవరు పొడవు దండ వేస్తారో సరదా పోటీ ఉంటుంది. దీంతో పోటాపోటీగా దండలు తయారు చేస్తున్నారు. పలుచోట్ల భోగిదండలను విక్రయిస్తుండడం కనిపించింది. భోగి సందర్భంగా చిన్నారులకు ఆదివారం భోగిపండ్లు వేయనున్నారు. చిన్నారులు ఉన్న గృహాల్లో దీన్ని ఒక వేడుకగా చేస్తారు. పండ్లు వేసే సమయంలో చేసే సందడి అంతాఇంతా కాదు.

మార్కెట్లు బిజీబిజీ..

జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాల్లో మార్కెట్‌లన్నీ శనివారం జనసంద్రమయ్యాయి. కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని, ఏలేశ్వరం, గొల్లప్రోలు పట్టణాలు సహా అన్ని మండల కేంద్రాలు, ముఖ్యకూడళ్లుగా ఉన్న గ్రామాల్లోని రహదారులన్నీ ప్రజలతో కిటకిటలాడాయి. రెడీమేడ్‌తోపాటు అన్ని వస్త్ర దుకాణాలు కొనుగోళ్లదారులతో కిక్కిరిసి పోయాయి. ప్రజలంతా పండుగ మూడు రోజులు కొత్త దుస్తులు ధరించేందుకు ప్రాధాన్యమిస్తారు. పండుగ సమయంలో తప్పనిసరిగా కొత్త వస్త్రాలు కొనుగోలు చేస్తారు. పిండివంటలకు అవసరమైన సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రజలు బయటకు వచ్చారు. దీంతో మార్కెట్లన్నీ రద్దీగా మారాయి.



పిఠాపురంలో భోగి దండలు అమ్ముతున్న వృద్ధురాలు

'స్పెషల్' దోపిడీ యథాతథం

- హైదరాబాద్‌నుంచి కాకినాడకు ఏసీ బెర్త్ రూ.4వేలు.. సీటు రూ.1,700

సామర్లకోట, జనవరి 13: సంక్రాంతి పండుగ రోజులు ప్రయాణికుల రద్దీని క్యాష్ చేసుకునేందుకు ప్రైవేట్‌బస్సు ఆపరేటర్లు స్పెషల్ దోపిడీకి ప్రారంభించారు. దీంతో ప్రయాణికులు దారుణ దోపిడీకి గురవ్వాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. గతనెల 25న ఆంధ్రజ్యోతిలో ముందే స్పెషల్ దోపిడీ పేరిట కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా ఆర్టీవో అధికారులు స్పందించి అదనపు చార్జీలు వసూలు చేయకుండా నిరోధించేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించామని తెలిపారు. ప్రైవేట్ ఆపరేటర్ల స్పెషల్ దోపిడీపై ఎటువంటి తనిఖీలు నిర్వహించకపోవడంతో యథాతథంగా దోపిడీ కొనసాగుతోంది. హైదరాబాద్‌నుంచి పండుగ రోజులకు ఇళ్లకు చేరుకునేందుకు అధిక శాతం ప్రయాణికులు ప్రైవేట్‌బస్సులను ఆశ్రయిస్తున్నందున డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అమాంతంగా టిక్కెట్ల చార్జీలను పెంచేశారు. హైదరాబాద్‌నుంచి కాకినాడ, సామర్లకోటకు రావాలంటే ఒక మనిషికి రూ.1,700 వసూలు చేస్తున్నారు. అదే ఏసీ బెర్త్ అయితే రూ.3,500 నుంచి రూ.4వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఏసీలో నిలుచుని ప్రయాణించాలన్నా రూ.2వేలు వసూలు చేస్తుండడం గమనార్హం. జిల్లా ఉపరవాణా అధికారినుంచి అందిన సమాచారం మేరకు కాకినాడనుంచి హైదరాబాద్‌కు 23బస్సులు, కాకినాడనుంచి బెంగుళూరుకు ఏడు బస్సులు, కాకినాడ నుంచి చెన్నైకి రెండు బస్సులు వెరసి 32 బస్సులు నడుపుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కానీ మరో 30 బస్సుల వరకూ అనధికారికంగా నడుపుతున్నట్లు ఆయా ఏజెంట్ల నుంచి అందిన సమాచారంగా తెలుస్తోంది. ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు స్పెషల్ పేరిట దోపిడీని నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల నిరసనలు



33రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏ జాలీ లేకపోవడంపై నిరసనగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో అంగన్‌వాడీలు భోగిమంటను వెలిగించి జీవోనెం.2 కాపీలను భోగిమంటల్లో తగులబెట్టి నిరసన తెలిపారు. తుని రూరల్‌లో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు.. - 7లో

టీడీపీలో భారీగా చేరికలు



వైసీపీనుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. జగ్గంపేట నియోజకవర్గంలో ఇన్‌చార్జి జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరు, వెంగాయమ్మపురం గ్రామాల నుంచి వైసీపీ నాయకులు భారీసంఖ్యలో టీడీపీలో చేరారు. కిర్లంపూడి మండలంలోని బూరుగుపూడిలో టీడీపీలో చేరుతున్న 50 కుటుంబాల వారు.. - 7లో

ముద్రగడ ఇంటివద్ద రాజకీయ కోలాహలం

కిర్లంపూడి, జనవరి 13: ముద్రగడ పద్మనాభం రాజకీయాల్లో చేరతారన్న సమాచారంతో ఆయన స్వగృహం కోలాహలంగా మారింది. జనసేన తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ముద్రగడ ఇంటికి వస్తారని, జనసేనలోకి ఆహ్వానిస్తారని తెలిపారు. కాగా, ప్రత్తిపాడు నియోజకవర్గం, పిఠాపురం పరిసర గ్రామాలనుంచి భారీసంఖ్యలో అభిమానులు ముద్రగడను కలిసేందుకు ఆయన ఇంటికి తరలివస్తున్నారు. దీంతో రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన స్వగృహం సందడిగా మారింది.



జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్, ఇతర నేతలతో ముద్రగడ

క్యాత్ ల్యాబ్ సేవలు ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ), జనవరి 13: ఎంత కాలంగానో అందని ద్రాక్షగా ఉన్న క్యాత్‌ల్యాబ్ సేవలు కాకినాడ జీజీహెచ్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఈ ల్యాబ్‌లో శనివారం మొట్టమొదటి యాంజియోగ్రామ్ పరీక్ష నిర్వహించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరివిజయకుమార్ పర్యవేక్షణలో, కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతి యాంజియోగ్రామ్ పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. క్యాత్‌ల్యాబ్ సాంకేతిక సిబ్బంది జీవన్‌కుమార్, స్టాఫ్ నర్సులు స్వప్న, అనితాదేవి ఈ పరీక్ష నిర్వహణలో పాల్గొన్నారు. మర్రివాడ గ్రామానికి చెందిన 55ఏళ్ల అప్పన్న ఆదినారాయణకు గుండెకు రక్తం సరఫరా చేసే రక్తనాళంలో రక్తం గడ్డ కట్టడంతో యాంజియోగ్రామ్ పరీక్షను నిర్వహించినట్లు డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. క్యాత్‌ల్యాబ్ అందుబాటులోకి రావడం ద్వారా పేద, మధ్య తరగతి హృద్రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. యాంజియోగ్రామ్ పరీక్ష నివేదిక ద్వారా గుండె సంబంధిత చికిత్సను సకాలంలో త్వరితగతిన అందించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, ఆర్ఎంవో డాక్టర్ యమున, క్యాత్‌ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాత్ ల్యాబ్‌లో జీజీహెచ్ వైద్య బృందం



సత్యదేవుడి దర్శనానంతరం సమాచార కమిషనర్

సత్యదేవుడి సన్నిధిలో సమాచార కమిషనర్ పూజలు

అన్నవరం, జనవరి 13: సత్యదేవుడి సన్నిధిలో శనివారం సమాచార హక్కుచట్టం కమిషనర్ కె.చెన్నారెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

గోవిందనామస్మరణతో
మార్మోగిన వెంకన్న ఆలయం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, జనవరి 13: అశేషభక్తజన గోవిందనామస్మరణ నడుమ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులతో మార్మోగింది. శనివారం వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల ఫలపుష్పాలతో స్వామివారి ఆలయాన్ని అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, తలనీలాలు, కానుకులు సమర్పించారు. అశేషభక్తజనం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.29.36 లక్షలు లభించినట్టు ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



వాడపల్లి స్వామివారిని దర్శించుకుంటున్న ఇంటెలిజెన్స్ చీఫ్ అజాద్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



పెద్దాపురం, జనవరి 13: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారు జాము నుంచే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,19,360 అన్నదాన విరాళాలు రూ.47,122 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.4,240 వెరసి రూ.1,70,722 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పులి నారాయణమూర్తి తెలిపారు. సుమారు 6వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

రఘురామకృష్ణంరాజుకు ఘనస్వాగతం



రావులపాలెం కళావెంకట్రావు సెంటర్‌లో ఎంపీ రఘురామకృష్ణంరాజును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

రావులపాలెం, జనవరి 13: రావులపాలెంలో నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. నాలుగు సంవత్సరాల తర్వాత స్వగ్రామం వెళుతున్న ఆయన శనివారం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో విమానం దిగి రోడ్డుమార్గంగుండా బయలుదేరారు. దీంతో రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకున్న ఆయనకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, టీడీపీ యువనాయకుడు బండారు సంజీవ్‌తో పాటు టీడీపీ, జనసేన నాయకులు చేరుకుని గజమాలతో సత్కరించారు. ఇందులో భాగంగా సతీష్‌రాజు రఘురామకృష్ణంరాజుకు సంక్రాంతి సందర్భంగా కోడిపుంజును అందించారు.

కాపులకు 75 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

● కాపునాడు జాతీయ అధ్యక్షుడు రమేష్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కాపునాడు జాతీయ అధ్యక్షుడు రమేష్ నాయుడు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో కాపులకు 75 అసెంబ్లీ స్థానాలు, 8 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని కాపునాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తాడివాక రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల జనాభా దామాషా 27 శాతం ప్రకారం అన్ని రాజకీయపార్టీలు సీట్లు కేటాయించాలని, నామినేటెడ్ పోస్టులతో పాటు అన్నిరంగాల్లో ప్రాతినిధ్యం కల్పించే రాజకీయ పార్టీలకే తమ మద్దుతు ఉంటుందన్నారు. రాజ్యాధికారంలో వాటా పొందడంతో పాటు రెండేళ్ల పవర్ షేరింగ్ విధానంలో ముఖ్యమంత్రి పదవి చేపట్టి తీరాలని డిమాండ్ చేశారు. కాపునాడు రాష్ట్ర కన్వీనర్ సిద్దా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ ఎవ్వరితో పొత్తుపెట్టుకున్నా అభ్యంతరంలేదుకానీ అంతిమంగా ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 6 అసెంబ్లీ స్థానాలు, 1 ఎంపీ స్థానాన్ని, ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలో 7 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఒక్కొక్క పార్లమెంట్, 5 అసెంబ్లీ స్థానాలు, రాయలసీమలో 5 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని కాపులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కాపునాడు పొలిటికల్ ఫ్రంట్ ఏర్పాటుచేసి తిరుపతి కేంద్రంగా కార్యాచరణ చేసేందుకు చర్చలు ప్రారంభిస్తున్నామన్నారు. సమావేశంలో కాపునాడు నాయకులు పెదిరెడ్డి మహేష్, వంగా ఆంజనేయులు, నల్లమిల్లి సత్యనారాయణ, వి.శ్రీదేవి, గంటా దివాకర్, జేటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత దుర్గేష్‌కు సతీవియోగం

● పలువురు నేతల సంతాపం



కందుల ఉషారాణి (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల లక్ష్మీదుర్గేష్‌కు సతీవియోగం సంభవించింది. ఆయన భార్య కందుల ఉషారాణి(53) కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతిచెందారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉషారాణి భౌతికకాయం రాత్రి రాజమహేంద్రవరం చేరుకుంది. ఆదివారం ఉదయం 10గంటలకు ఇన్నీసుపేట కైలాసభూమిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం ఉదయమే దుర్గేష్‌కు ఫోనుచేసి పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, టీడీపీ నాయకులు గన్నికృష్ణ, ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావులు ఉషారాణి మృతి పట్ల సంతాపం తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసం

● నాయకుల పేర్లపై వివాదం ● ఆవిష్కరణ సమయంలోనే శిలాఫలకం మాయం



అనపర్తిలో వివాదాస్పదంగా మారిన అంబేడ్కర్, పూలే విగ్రహాల ప్రాంగణం, విగ్రహ శిలాఫలకం ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ శివగణేష్

అనపర్తి జనవరి 13: అనపర్తి కెనాల్ రోడ్డులో ఇటీవల ప్రారంభమైన బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాల శిలాఫలకాలు వివాదాస్పదంగా మారాయి. శుక్రవారంరాత్రి దుండగులు అంబేడ్కర్ విగ్రహానికి ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గత నెల 30న అంబేడ్కర్, పూలే విగ్రహాల ప్రారంభోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేసి పూలే విగ్రహానికి ప్రారంభకులు ఎంపీ భరత్‌రామ్, శిలాఫలక ఆవిష్కరణ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పేర్లను, అంబేడ్కర్ విగ్రహానికి ప్రారంభకులు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, శిలాఫలకం ఆవిష్కరణ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్లను ఏర్పాటు చేశారు. అయితే ప్రారంభోత్సవం ముందురోజు రాత్రి అంబేడ్కర్ విగ్రహంవద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకం మాయమైంది. మాజీ ఎమ్మెల్యే పేరు ఉన్నందునే దానిని మాయం చేశారని ఒక వర్గం ఆరోపించింది. దీంతో శిలాఫలకం ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటుచేసి ప్రారంభోత్సవం పూర్తిచేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి శిలాఫలకం ఏర్పాటుచేశారు. అయితే దానిని శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి శిలాఫలకం ధ్వంసమైన ప్రాంతం లో ప్లాస్టిక్ కవర్‌ను కప్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ పికెట్‌ను ఏర్పాటుచేశారు. కాగా శిలాఫలకం ధ్వంసంపై నల్లా చిన్నారావు, పచ్చిమళ్ల వెంకటరమణ విడివిడిగా ఫిర్యాదులు చేశారని, కోర్టు అనుమతితో కేసులు నమోదు చేస్తామని సీఐ చెప్పారు.

జోనల్‌స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల విన్నర్‌గా జగన్



జోనల్‌స్థాయి బాడీబిల్డింగ్ విజేతగా నిలిచిన కోనసీమ జిల్లాకు చెందిన జగన్



బాడీబిల్డింగ్ పోటీల విజేతలకు షీల్డులు అందజేసిన డీఎస్పీ అంబికాప్రసాద్

అమలాపురంటౌన్, జనవరి13: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో గోదావరి జోనల్‌స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం అర్ధరాత్రి వరకు నిర్వహించారు. ఆయా పోటీల విజేతల వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు శనివారం ప్రకటించారు. కోనసీమ జిల్లాకు చెందిన ఎం.జగన్ టైటిల్ విన్నర్‌గాను, కాకినాడ జిల్లాకు చెందిన టి.ప్రశాంత్ రన్నర్‌గాను నిలిచారు. కాకినాడజిల్లా టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గాను, కోనసీమజిల్లా రన్నర్‌గాను నిలిచిం దన్నారు. బహుమతి ప్రధానోత్సవ సభకు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 160 మంది బాడీబిల్డర్లు 12 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నట్టు అసోసియేషన్ కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. 55కిలోల విభా గంలో కె.ప్రసాద్(కాకినాడ), 60 కిలోల విభాగంలో ఎం.జగన్ (కోనసీమ), 65కిలోల విభాగంలో కె.సిద్దు(కాకినాడ), 70కిలోల విభాగంలో ఎన్.రోహిత్(కోనసీమ), 75కిలోల విభాగంలో టి.ప్రశాంత్ (కాకినాడ), 75కిలోల పైబడిన విభాగంలో డి.శ్రీను (కాకినాడ)లు విజేతలుగా నిలిచారు. మాస్టర్స్ విభాగంలో టి.అబ్బులు(కోనసీమ), దివ్యాంగ విభాగంలో జి.మోషే(ఏలూరు), ఫిజిక్ స్పోర్ట్స్ 165 సెంటీమీటర్ల బిలో కేటగిరిలో కె.సాయిగణేష్ (పశ్చిమగోదావరి), 165 సెంటీమీటర్ల పైబడిన విభాగంలో సీహెచ్ ఇళయరాజా(కాకినాడ)లు ప్రథమస్థానాలు సాధించారు. వారికి డీఎస్పీతోపాటు జనసేన పార్లమెంటు ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, ఆఫీసర్స్ క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్, పవన్‌లిఫ్టింగ్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, జంప న సుమన్‌వర్మ, లింగోలు పండులతోపాటు అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ విజేత పిల్లి వందనలు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

చదువులమ్మ చెట్టు నీడన..

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మోరి హైస్కూలులో కలిసిన 1979-84 పూర్వ విద్యార్థులు

అంతర్వేది, జనవరి 13: నాలుగు దశాబ్దాల క్రితం సరస్వతీ నిలయ మైన ఆ చదువులమ్మ చెట్టు నీడన చదువుకున్న పూర్వ విద్యార్థులంతా అదే పాఠశాలలో మరోసారి కలుసుకుని ఆనంద పరవశులయ్యారు. సఖినేటిపల్లి మండలం మోరి జానసుబ్బమ్మ మెమోరియల్ జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో 1979-84లో 6 నుంచి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డా తిరిగి అదే చదువులమ్మ ఒడిలో బుద్ధిగా ఒదిగిపోయారు. అలనాటి మధుర స్మృతులను తలుచు కుని విద్యార్థులుగా మారిపోయి సందడి చేశారు. అలనాటి తరగతి గదుల్లో తిరుగుతూ సందడి చేశారు. తొలుత అలనాటి విద్యార్థులు కామిశెట్టి మాచరమ్మ, పడవల కోట సూర్యకు మారి, నిమ్మగడ్డ ఝాన్సీ గుత్తి సుబ్బలక్ష్మి, సరెళ్ల పద్మ, భాగ్యలక్ష్మి తదితరులు జ్యోతి ప్రజ్వలనచేసి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు డాక్టర్ ఆకుల వెంకట రామ్మోహనరావు అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థుల పరిచయం అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కోలాటం ఆడారు. సంక్రాంతి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ ప్రతినిధులు రాపాక పెద్దిరాజు, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావు, శ్రీపాద వెంకటేశ్వర్లు, పసలపూడి శ్రీనివాసరావు, గానాల వెంకటా చార్యులు, బళ్ల మహాత్మాగాంధీ, కాశిన సూరన్న పాల్గొన్నారు. కుమార్తె వర్షితతో కలిసి తండ్రి శ్రీపాద వెంక టేశ్వర్లు చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. జంటకవులు పసలపూడి శ్రీనివాసరావు, గోళ్ల ప్రకాష్‌లను సత్కరించారు. నిర్వాహకులతో పాటు విదేశాల నుంచి వచ్చిన మేకలలక్ష్మి, గెడ్డం రాజబాబు, నల్లి జనార్ధనరావులను సత్కరించారు.

మకరదర్శనం కోసం ద్వారపూడి అయ్యప్ప ఆలయం ముస్తాబు

● గురుస్వామి ఎస్ఎల్ కనకరాజు



మండపేట, జనవరి 13: ఆంధ్ర శబరిమలైగా పిలువబడే ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం కోసం ఏర్పాట్లను చేస్తున్నామని ఆలయ ట్రస్టీ ఎస్.ఎల్. కనకరాజు గురుస్వామి వెల్లడించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం ద్వారపూడి అయ్యప్పస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న సోమవారం ఉదయం 4.30నుంచి ప్రారంభమయ్యే మహాగణప తిహోమం, 6గంటలకు స్వామివారికి ఇరుముడి అభిషేకం, 8.30కు స్వామివారి రథం, స్వామివారి ఆభరణాల పెట్టెను రాయవరం మండలం మాచవరానికి చెందిన కర్రి ఆదిరెడ్డి శిరస్సుపై ఉంచి గ్రామంలో గ్రామోత్సవం ఊరేగింపు, జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం 4గంటలకు, ఆలయ ప్రాంగణంలో ఉన్న దేవతామూర్తులు విగ్రహాలకు ఆభరణాలు విశేష పూజలు, పుష్పాలంకరణ, జరుగు తాయన్నారు. సాయంత్రం ఆలయంవద్ద కొమరిపాలెం వారిచే భారీగా బాణాసంచా కాలుస్తారన్నారు. అనంతరం సాయంత్రం 6.30కు మకరజ్యోతి(కర్పూరనీరాజనం) మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని గురుస్వామి కనకరాజు భక్తులకు పిలుపునిచ్చారు.

హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం, జనవరి 13: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న 13వ ఆలిండియా 19వ ఆంధ్రప్రదేశ్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్, రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఓపెన్ కేటగిరీలో నిర్వహిస్తున్న ఈ పోటీలను లీగ్, నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. పురుషుల విభాగంలో రామచంద్రపురం ఎ జట్టు ఖమ్మంజట్టుపై 75-47 పాయింట్లతోనూ హైదరాబాద్ డిఫెన్స్ జట్టు, కాకినాడ డీఎస్ఏ జట్టుపై 41-10, ఆర్టిలరీ జట్టు సామర్లకోటపై 45-22, డీబీఏ జట్టు హైదరాబాద్ జట్టు జి.మామిడాడపై 55-48 కమర్షియల్ టాక్స్ అండ్ ఎక్సైజ్ జట్టు ఏపీఎస్పీ కాకినాడ జట్టుపై 60-42, డీఎస్ఏ కాకినాడ జట్టు హైదరాబాద్ సెయింట్‌పై 53-42 రాజమండ్రి సీబీఏ జట్టు రామచంద్రపురం బి జట్టుపై 44-23, అనంతపురం జట్టు సామర్లకోట జట్టుపై 32-20, గుంటూరు జట్టు ఏపీఎస్పీ కాకినాడ జట్టుపై 55-47 పాయింట్లతో గెలుపొందినట్లు రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. మహిళల విభాగంలో చత్తీస్‌గడ్ జట్టు మేరీ స్టెల్లా జట్టుపై 42-10, డిఫెన్స్ హైదారాబాద్ జట్టు కాకినాడ డీఎస్ఏ జట్టుపై పై 41-10 విజయవాడ సీబీఏ జట్టు అమలాపురంపై 26-10, రామచంద్రపురం జట్టు అమలాపురంపై 45-7, డీబీఏ హైదరాబాద్ జట్టు విజయవాడ స్టెల్లా జట్టుపై 31-8, ఏలూరుజట్టు కాకినాడ డీఎస్ఏ జట్టుపై 29-4 పాయింట్లతో గెలుపొందినట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గన్నమని తెలిపారు. బాస్కెట్ బాల్ రామచంద్రపురం అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, జె.దుర్గాప్రసాద్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ధర్మమంటే ఒక మతం కాదు..

● పరిపూర్ణానందసరస్వతి స్వామిజీ



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతి స్వామిజీ, చిత్రంలో రాంమాధవ్

అమలాపురం రూరల్, జనవరి 13: భారతీయ సనాతన ధర్మం విశ్వ వ్యాప్తమని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతిస్వామిజీ పేర్కొన్నారు. ధర్మమంటే ఒక మతంకాదని గుర్తించాలన్నారు. ఈదరపల్లిలో సేవాభారతి, రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో నిర్మించిన జనహిత కార్యాలయం అదనపు భవనాన్ని శనివారం ఆర్ఎస్ఎస్ అఖిలభారత కార్యకారిణి సదస్యులు వారణాసి రాంమాధవ్‌తో కలిసి స్వామిజీ ప్రారంభించారు. సేవాభారతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా తొలుత ముఖ్యఅతిథులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామిజీ గోపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యవక్తగా సహక్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ హాజరై ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. ముఖ్య అతిథులు రాంమాధవ్ మాట్లాడుతూ అయోధ్యలో ఈనెల 22న రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠతో భారతీయుల్లో స్థిరప్రతిష్ఠ జరుగుతుందన్నారు. పరిపూర్ణానంద సరస్వతిస్వామి మాట్లాడుతూ సేవా భారతి, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన అమలాపురంలో జనహిత కార్యాలయాన్ని నిర్మించడం అద్భుతమన్నారు. మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) తనవంతుగా ఆర్థిక సాయాన్ని ప్రకటించి జనహిత ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల ను ప్రశంసించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సంపర్క్ బులుసు జగదీష్, రాష్ట్ర అధ్యక్షుడు సుంకవిల్లి రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర, విభాగ్ ప్రము ఖులు డాక్టర్ గోదశి గంగరాజు, శ్రీరామచంద్రరాజు, ఓలేటి సత్యనారాయణ, సోమశేఖర్, జీవీఎస్ కామేశ్వరరావు, వాసంశెట్టి బలరా మకృష్ణ, అమ్మిరాజుతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల బాలుడి మృతి

● అపస్మారక స్థితిలో భార్య
● భర్త, మరో కుమారుడికి తీవ్ర గాయాలు



గొల్లప్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌ను ఢీకొట్టిన కారు

గొల్లప్రోలు, జనవరి 13: కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రెండేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య అపస్మారక స్థితిలో చేరుకోగా, మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన తీరు చూపరులను కన్నీరు పెట్టించింది. రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన సీహెచ్.వెంకటరమణ తన సతీమణి గౌతమి, కుమారులు దుర్గాప్రసాద్, శ్రీచైతన్యలతో కలిసి శనివారం అన్నవరం వెళ్లారు. సత్యదేవుని దర్శనం అనంతరం అక్కడే భోజనంచేసి మోటార్‌సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. కోటనందూరు మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన వ్యక్తులు కారులో వెళ్తూ గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో పెట్రోల్‌బంకు జంక్షన్ వద్ద వెనుక నుంచి మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో రెండేళ్ల శ్రీచైతన్య అక్కడికక్కడే మరణించాడు. గౌతమి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంకటరమణ, బాలుడు దుర్గాప్రసాద్‌లకు తీవ్రగాయాలయ్యాయి. తన తమ్ముడు శ్రీచైతన్య చనిపోవడం, తల్లి గౌతమి చలనం లేకుండా పడి ఉండటంతో దుర్గాప్రసాద్ విలపిస్తున్న తీరు అందరికంట కన్నీరు తెప్పించింది. వెంకటరమణ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు. గాయపడిన వారిని హైవే మొబైల్ సిబ్బంది తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో అపస్మారకస్థితిలో ఉన్న భార్య, తీవ్రంగా గాయపడ్డ భర్త, కుమారుడు

బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్

గండేపల్లి, జనవరి 13: యూత్ డే సందర్భంగా కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రెండో గోదావరి జోనల్ బాడీ బిల్డింగ్ బెస్ట్ ఫిజిక్ చాంపియన్‌షిప్‌లో సూరంపాలెంలోని ఆదిత్య కళాశాలలో సివిల్ విభాగం నందు ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎస్.రోహిత్ గోల్డ్ మెడల్ సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, కోచ్ డి.సాయికిషోర్ అభినందించారు.

యువత సంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలి : ఎస్పీ



బహుమతి అందజేస్తున్న ఎస్పీ జగదీష్

కడియం, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా యువత జూద క్రీడల వైపు కాకుండా సంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు ఆధ్వర్యం లో సీఐ తిలక్ పర్యవేక్షణలో కడియం పోలీస్‌స్టేషన్ వద్ద రెండు రోజుల పాటు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. యువత జూదాలకు దూరంగా ఉండాలని, క్రిమినల్ కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్‌లో ఉద్యోగవకాశాలు కోల్పోతారన్నారు. కోచ్ ఎన్వీ భద్రంను ఘనంగా సత్కరించారు.

విజేతలు వీరే...

బీజీ సాయి, పి.ప్రవీణ్ (కాకినాడ), జి.సాయి మనీష్, ఎస్‌కే నవాబుల్లా(కాకినాడ), జీవీ చైతన్య, కె.చైతన్య(రాజమహేంద్రవరం), నున్నా సూర్య, తోట స్వామి (వేమగిరి), గోరు బాబు, సాయి(కడియపులంక), వెంకట్, శ్రీధర్ (ధవళేశ్వరం), అంజి, బాబి(కడియం) విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్, ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరంలో సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, జనవరి 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉదయం 5గంటలకు స్వామి,అమ్మవార్లను పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ వార్షిక కల్యాణవేదిక వద్దకు తోడ్కొని వచ్చి పండితులు ప్రత్యేకపూజలు నిర్వహించి భోగిమంటను వెలిగిస్తారు. ఈ సందర్భంగా ఆలయప్రాంగణాన్ని పూర్తిగా పల్లెటూరి వాతావరణంగా తీర్చిదిదారు. తాటిచెట్లు, కుమ్మరికుండలు, నేల బావి, గడ్డిమేటు, ఎడ్లబండి, పిండివంల తయారీ, చిన్నారులకు భోగిపళ్ల వేయడం, కోడిపుంజులు తదితరవాటిని ఏర్పాటుచేయడంతో పాటుగా జంగమదేవర, బుడబుక్కలవేషదారణ, హరిదాసులు తదితర కళాకారులతో విన్యాసాలు ఏర్పాటు చేశారు. వాటిని శనివారం ఈవో రామచంద్రమోహన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్ఎంసీకి పూర్వ విద్యార్థుల వితరణ


ఆర్థిక సహకారం అందించిన పూర్వ విద్యార్థులతో డాక్టర్ నరసింహం బృందం

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 13: కాకినాడ రంగరాయ వైద్యకళాశాల (ఆర్ఎంసీ)లో విద్యనభ్యసించి దేశ, విదేశాల్లో నిష్ణాతులై వైద్యులుగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారు. ఆర్ఎంసీ 1998 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులు సమకూర్చిన రూ.3.5లక్షల విలువైన డిజిటల్ క్లాస్‌రూం బోర్డు, ఏసీ తదితర ఉపకరణాలను ఆ బ్యాచ్ విద్యార్థులైన సైకియాట్రిస్ట్ డాక్టర్ వి.వరప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ కరుణ తమ బ్యాచ్ తరుపున ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరావుకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం హాజరయ్యారు. అనంతరం జీజీహెచ్ ప్రాంగణంలోని ఎస్‌పీఎం గ్యాలరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1972 ఎంబీబీఎస్(జెమ్స్) బ్యాచ్ తరపున డాక్టర్ పబ్బిసెట్టి రఘునాథ్, డాక్టర్ ఎస్వీ బాబు, డాక్టర్ గవర రవికుమార్, డాక్టర్ పీఎస్ఎన్ రాజు కలిసి ఎస్‌పీఎం విభాగానికి రూ.5లక్షల విలువైన డిజిటల్ బ్లాక్ బోర్డు, రెండు టీవీలను అందజేయగా డాక్టర్ నరసింహం వాటిని ప్రారంభించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఎస్‌పీఎం ప్రొఫెసర్ డాక్టర్ సుజాత, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ నూకల శ్రీనివాస్, డాక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.

కియా సోనెట్ ద వైల్డ్ రీబోర్న్ కారు విడుదల



కారును విడుదల చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 13: కియా సోనెట్ ద వైల్డ్ రీబోర్న్ న్యూవెర్షన్ కారును ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ మార్కెట్‌లోకి వచ్చింది. ఈ మేరకు శనివారం కాకినాడలోని కంటిపూడి కియా షోరూమ్‌లో కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు ఈ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ జీఎం కామేష్ మాట్లాడుతూ సరికొత్త కియా సోనెట్‌ని ఆరు ఎయిర్ బ్యాగ్స్ స్టాండర్డ్, రోబస్ట్, 15 స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్స్, అడ్వాన్స్ ఏడీఏఎస్ 10 అటోనమస్ ఫీచర్స్ ఫ్యూచరిస్టిక్, డిజిటల్ స్క్రీన్, క్లస్టర్, స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫైర్, 360 డిగ్రీ కెమెరా, అత్యాధునిక స్మార్ట్ టెక్ 70 కియా కనెక్ట్ ఫీచర్స్‌తో పెట్రోల్, డీజిల్ ఆప్షన్స్‌తో అందుబాటులోకి వచ్చిన ఈ కారు బుకింగ్స్ ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కె.వినయ్ బాబు, ఎం.జగన్, సీహెచ్.సత్యనారాయణమూర్తి, కె.మన్మోహన్‌రామ్ పాల్గొన్నారు.

కోడి పందాల టెంట్లు తొలగించిన పోలీసులు

కొత్తపల్లి, జనవరి 13: మండలంలో కోడిపందాల నిర్వాహణకు ఏర్పాటుచేసిన బరుల్లో టెంట్‌లను పోలీసులు శనివారం తొలగించారు. వాకతిప్ప, కొత్తపల్లి, కొండెవరం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట గ్రామాల్లో పందాల నిర్వహణకు ఏర్పాటు చేసుకున్న టెంట్‌లను ఎస్ఐ పి.స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు తొలగించారు. సంక్రాంతి పురస్కరించుకుని సంప్రదాయ క్రీడలను ఏర్పాటు చేసుకోవాలని.. కోడిపందాలు, గుండాట, జూదాలు ఆడరాదని నిర్వాహకులను ఎస్ఐ హెచ్చరించారు.

సారా, మద్యంతో ముగ్గురి అరెస్ట్

ప్రత్తిపాడు, జనవరి 13: ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో శనివారం స్థానిక సెబ్ అధికారులు దాడులు నిర్వహించి నాటుసారా, మద్యంసీసాలు స్వాధీనం చేసుకుని ముగ్గురు మహిళలను అరెస్ట్ చేశారు. లంపకలోవలో 30లీటర్ల సారాతో వాసంశెట్టి సరస్వతిని అరెస్ట్ చేసి ఆమెకు సారాను సరఫరా చేసిన సూరంపూడి సుమనపై కేసు నమోదు చేశారు. ధర్మవరంలో 7మద్యం బాటిళ్ళతో చిలకలపల్లి లక్ష్మి, జగపతినగరంలో 6 మద్యం సీసాలతో రావుల నాగరాజు అనే మహిళను అరెస్ట్ చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్ఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది వెంకన్నదొర, కృష్ణార్జున, దొరబాబు, రాంబాబు, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

గండేపల్లి, జనవరి 13: సారా బట్టీపై శనివారం ఎస్ఐ ఎన్.రామకృష్ణ, సిబ్బందితో దాడులు చేశారు. మండలంలో తాళ్ళూరు గ్రామ శివారులో రహస్య ప్రదేశంలో నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసి 30లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

దేవి మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

సామర్లకోట, జనవరి 12: సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి ఉత్తర క్యాబిన్ సమీపాన వేగంగా వెళుతున్న రైలు నుంచి సుమారు 40ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి జారిపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. ఈ మేరకు సామర్లకోట రైల్వే కీమెన్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీఎం జగన్‌ది రాక్షస పాలన

» టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ

» వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు


జగ్గంపేట రూరల్: జె.కొత్తూరులో వైసీపీ నుంచి టీడీపీలో చేరినవారితో జ్యోతుల నెహ్రూ


శంఖవరం: కత్తిపూడిలో కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

జగ్గంపేట రూరల్, జనవరి 13: సీఎం జగన్ ఒక్క అవకశం అంటూ గద్దె నెక్కి రాక్షస పాలన సాగించాడని, నమ్ముకున్న కార్యకర్తలను నట్టేటముంచిన పార్టీ ఏమైనా ఉందంటే అది ఒక్క వైసీపీ అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఎద్దేవా చేశారు. మండలంలోని జె.కొత్తూరు, వెంగాయమ్మపురం గ్రామాల నుంచి వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి శనివారం నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలు తనను కలిసినప్పుడు ఇంతటి రాక్షసపాలన సాగిస్తాడని కలలో కూడా ఊహించలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో ప్రతి వీధిని సిమ్మెంటు రోడ్డు వేసిందని, సిమ్మెంటు రోడ్డుకు డ్రైన్ కూడా నిర్మించాలేని దద్దమ్మపాలన వైసీపీ సాగించిందన్నారు. జె.కొత్తూరులో పార్టీలో చేరిన వారు నకిరెడ్డి కాటయ్య, గందం దుర్గ, రాజమండ్రపుస్వామి, ఉంగరాల సాగు, నక్కన వివ, దెయ్యాల సూరిబాబు, పప్పిశెట్టి బాబ్జి, గొల్లేపల్లి కృష్ణ, నిడమర్తి దుర్గాప్రసాద్, కందికట్లా రాజేష్, నొక్కు వీరబాబు, వెంగాయమ్మపురం గ్రామానికి చెందినవార్డు సభ్యులు మడక అచ్చిరాజు, అప్పన కోదండరాం, సేనాపతి శ్రీను, చరకని చక్రయ్య ఉన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం,చల్లా రామ్మూర్తి, కేసి రెడ్డిశ్రీను, అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో...

కిర్లంపూడి, జనవరి 13: బూరుగుపూడి గ్రామ సీనియర్ నాయకులు కుంచే తాతాజీ, తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో భారీ చేరికలు జరిగాయి. కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరయ్యారు. వారి సమక్షంలో వైసీపీ నుంచి సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నెహ్రూ,నవీన్‌లను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ పుష్కర ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయవద్దని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికి చెప్పింది తోట నరసింహమేనని అన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు సాయితేజ్, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు అడబాల వెంకటేశ్వరరావు, కొత్తకొండబాబు, పాఠంశెట్టి మురళీకృష్ణం, పాఠంశెట్టి కొండరాజులు, కర్నాకుల పెదకాపు, పాఠంశెట్టి తమ్మారావు, కుంచే శ్రీనివాస్, పాఠంశెట్టి నాగేశ్వరరావు,ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ మూరా సత్తిబాబు, జిల్లా టీడీపీ నాయకులు తూముకుమార్ ఉన్నారు.

కత్తిపూడిలో...

శంఖవరం, జనవరి 13: ప్రత్తిపాడు వైసీపీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ సొంత మండలం శంఖవరంలో ఆ పార్టీ ముఖ్యనాయుకులు సుమారు 200 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ ఆధ్వర్యంలో కత్తిపూడిలో గౌతు దొరబాబు, నాయుడు ఈశ్వరరావు, నాయుడు బుజ్జి, రౌతు శివ, గౌతు కృష్ణారావు తమ అనుచరులతో టీడీపీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యకర్తలందరూ కష్టించి పనిచేసి ప్రతీ గ్రామంలో తెలుగుదేశం జెండా రెపరెపలాండించాలని సత్యప్రభ కోరారు. టీడీపీ నేత పర్వత సురేష్, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, యర్రశెట్టి బాబ్జీ, జ్యోతుల శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తి వెంకటసుబాష్, బచ్చల గంగ, బద్ది రమణ, కంచిబోయిన శ్రీను, గాబు శివ పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి

రంగవల్లుల పోటీలు

కళకళలాడిన దుకాణాలు


ప్రత్తిపాడు: ధర్మవరంలో గొబ్బెమ్మలతో సంక్రాంతికి స్వాగతం పలుకుతున్న చిన్నారులు


సర్పవరం జంక్షన్: తిమ్మాపురంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

సర్పవరం జంక్షన్, జనవరి 13: జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ ఆధ్వర్యంలో తిమ్మాపురంలో ఆ పార్టీ నాయకుడు మాదారపు తాతాజీ అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద గ్రైండర్లు, గ్యాస్ స్టౌ, బహుమతులు పంపిణీ చేశారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం కూచిపూడి నృత్య విద్యార్థులు రంగవల్లుల్లో గొబ్బెమ్మలుపెట్టి సందడి చేశారు. శ్రీ సీతారత్న లలితా కళానృత్యనికేతన్ నాట్యాచారని ముళ్ళపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మండల గ్రామాల్లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి వేళ మండలంలోని వస్త్ర దుకాణాలు కళకళలాడాయి. హోల్‌సేల్‌వస్త్ర దుకాణాలతో పాటు రెడీమేట్ వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి. పిండి వంటలకు సామగ్రి కోసం కిరాణా దుకాణాల వద్ద ప్రజానీకం బారులు తీరారు.

జగ్గంపేట: సంక్రాంతి సందర్భంగా ప్రజలు తమ సొంత గ్రామాలు వెళ్తున్నారు. దీంతో కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద తెలవారుజాము నుంచి ట్రాఫిక్ అధికమైంది. జగ్గంపేట జాతీయ రహదారిపై శనివారం ఉదయం నుంచి వాహన రాకపోకలు రద్దీ కనిపించింది.

తుని రూరల్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని తుని ప్రధాన మార్కెట్ అయిన గొల్లప్పారావుసెంటర్‌తో పాటుగా ఇతర ప్రధాన కూడళ్ల జనాలతో కిటకిటలాడాయి. పండుగల వేళ షాపింగ్‌కు తరలివచ్చిన ప్రజలతో షాపింగ్ మాల్స్‌థియేటర్స్ జన సంచారంతో కిక్కిరిశాయి.

కొత్తపల్లి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో పిడకల దండే కార్యక్రమాన్ని చిన్నారులు చేపట్టారు. ఇలా నిర్వహించడం పట్ల పెద్దలు సంతోషం వ్యక్తం చేశారు.

పిఠాపురం: పట్టణంలోని కుమ్మరవీధిలో శనివారం ముగ్గుల పోటీలు ఉత్సాహపూరితంగా జరిగాయి. మున్సిపల్ కౌన్సిలర్ సోమరౌతు లలితాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు వైస్‌చైర్మన్ కొత్తపల్లి పద్మబుజ్జి, కౌన్సిలరు మతం లోవరాజు బహుమతులు అందజేశారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 13: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ప్రత్తిపాడులో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్(ఐలాజ్) రాష్ట్ర కన్వీనర్ బుగతా శివ ఆధ్వర్యంలో ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై శనివారం రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా, ఐలాజ్ కన్వీనర్ బుగతా శివ, జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు, బీసీవై రాష్ట్ర సమన్వయ సారధి దేవర అనూషయాదవ్, రాష్ట్ర గిరి జన సంఘం నాయకులు రేచుకట్ల సింహాచలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ హక్కుచట్టం పేద, బలహీన వర్గాలు, రైతుల భూములకు, ఆస్తులకు నష్టం కలిగిస్తుందన్నారు. ప్రజలు ఈ చట్టంతో తీవ్ర అన్యాయానికి గురవుతారని, హక్కులు కోల్పోతారని ఆందోళన చేశారు. రాష్ట్ర బీసీ ఐక్యపోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ ఏపూరి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతారపు రాజు, లిబరేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు మానుకొండ లచ్చబాబు, సీపీఎం మండల కార్యదర్శి రొంగల ఈశ్వర్రావు, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ, నాయవాదులు పిల్లి బలరాముడు, అవసరాల దేవిలు ఈ చట్టం వల్ల కలిగే నష్టాలు వివరించారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను, టీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు


సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జనవరి 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విభజన హామీల అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు అన్నారు. కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన నగర ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ప్రమాణస్వీకారం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పళ్లంరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటా సౌభాగ్యం.. పేరిట కాకినాడ నగరంలోని 50 డివిజన్లలో పర్యటిస్తామన్నారు. నగర కమిటీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏఐసీసీ సభ్యులు మల్లిపూడి రాంబాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ప్రసాదవర్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



పెదపూడి, జనవరి 13: గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 1987 నుంచి 1992 వరకు విద్యనభ్యసించిన విద్యార్థుల అపూర్వ కలయిక శనివారం జరిగింది. పాఠశాల ఆవరణలో గత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఆరుమిల్లి శ్రీనివాస్, పరిమి బద్రి, కొంగర శ్రీనివాస్, దేవగుప్తాపు సాంబ,బొడ్డు హరికృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అంగన్‌వాడీల నిరసనలు


తాళ్లరేవులో భోగిమంట వద్ద నిరసన

తాళ్లరేవు, జనవరి 13: తాము 33రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏ జాలీలేకపోవంపై నిరసనగా తాళ్లరేవులో అంగన్‌వాడీలు భోగిమంటను వెలిగించి శనివారం ఆందోళన తెలియజేశారు. సమ్మె శిబిరం వద్ద ముగ్గులువేసి భోగిమంట వెలిగించి చూట్టూ కోలాటం ప్రదర్శన చేసి జీవోనెం.2 కాపీలను భోగిమంటలో తగులబెట్టారు. పండుగ రోజులు కూడా సమ్మె నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు.

పెద్దాపురం: తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో జగన్ భవిష్యత్తును నిర్ణయించేది తామేనని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు దాడి బేబీ అన్నారు. మున్సిపల్ జంక్షన్ వద్ద శనివారం అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రంగవల్లులను తీర్చిదిద్ది నిరసన తెలియచేశారు. బేబీ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాగమణి, అమల, ఎస్తేరురాణి, అంగనవాడీ యూనియన్, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తుని రూరల్: అంగన్‌వాడీలు తునిలో భోగి మంటలు, గొబ్బెమ్మలతో వినూత్న నిరసన చేపట్టారు. పండుగ వేళ అక్కాచెల్లెమ్మలను రోడ్లపై ఉంచడం మీకు తగునా అంటూ ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శిస్తూ వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ధనలక్ష్మి, లలిత కుమారి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో అంగన్‌వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేసి ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అల్లాడి లక్ష్మి, హేమలత, పద్మ, వెంకటలక్ష్మి, తులసి, నాగసత్యవతి పాల్గొన్నారు. ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేశారు.

సామర్లకోటలో ఎస్పీ సందర్శన


పోలీసులకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ

సామర్లకోట, జనవరి 13: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం సామర్లకోట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సామర్లకోట ఎస్‌హెచ్‌వో కార్యాలయం ఆధునీకరణ పనులను ఎస్పీ చేతుమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాల్లో సంప్రదాయక్రీడలను మాత్రమే ఆడుకోవాలని, అసాంఘిక క్రీడ జూదాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. సామర్లకోట ఎస్‌హెచ్‌వో సురేష్, ఎస్ఐలు మౌనిక, పీవీఆర్.మూర్తి తదితర సిబ్బంది పాల్గొన్నారు. విధినిర్వహణలో విశేష సేవలందించిన పలువురు సిబ్బందికి ఎస్పీ చేతులమీదుగా నగదు బహుమతులను అందజేశారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 13: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కాకినాడ జీజీహెచ్ కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ ఆస్పత్రి ప్రాంగణంలోని మాతాశిశు విభాగం వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో సంఘ అధ్యక్షుడు సీహెచ్.విజయకుమార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా తాము కాంట్రాక్ట్ పద్ధతిన పారిశుధ్య కార్మికులుగా జీజీహెచ్‌కు సేవలందిస్తున్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా యాజమాన్యం చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ వాటా కూడా కార్మికుల వేతనాల నుంచే మినహాయిస్తున్నారని వాపోయారు. దీనిపై కలెక్టర్ సహా అధికారులందరికీ లిఖిత పూర్వకంగా విన్నవించినా న్యాయం జరగలేదన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, కోశాధికారి వెంకటరమణ, యూనియన్ నాయకులు శేషు, రాయుడు రమేష్, వాసు, పుష్ప, రమణమ్మ, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, ఏసు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని శివపంచాయత యాగం


యాగం నిర్వహిస్తున్న వర్మ, గిరీష్ వర్మ దంపతులు

పిఠాపురం, జనవరి 13: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో శివపంచాయత యాగం చేపట్టారు. 5రోజులు పాటు జరిగే ఈ యాగక్రతువును కాకినాడలోని తన నివాసంలో శనివారం వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య ప్రారంభించారు. వర్మ, లక్ష్మీదేవి దంపతులు, వర్మ కుమారుడు గిరీష్ దంపతులు యాగంలో పాల్గొన్నారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని, అందుకే ఈ యాగం నిర్వహిస్తున్నట్లు వర్మ తెలిపారు. బాబుకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు.

వెంకన్నకు విశేష పూజలు


వేట్లపాలెంలో విశేష పూజలు నిర్వహించిన దృశ్యం

సామర్లకోట, జనవరి 13: మండలంలోని వేట్లపాలెం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములతో వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి పంచ ద్రవ్యములతో అభిషేకించారు. అనంతరం లక్షతులసి అర్చన పూజలు చేశారు. ధనుర్మాసం శ్రవణా నక్షత్ర పర్వదినం సందర్భంగా 108 ముత్తైదువులతో సామూహిక వ్రతపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పారిశ్రామికవేత్తలు గోలి ధర్మరాజు, నున్న రామకృష్ణ, గోలి రవి, నున్న నారాయణరావు, గుమ్మళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాముకు ఉత్తమ కవి అవార్డు

సర్పవరం జంక్షన్, జనవరి 13: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో వైఎంహెచ్ హాల్లో శనివారం ఏపీ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య సంక్రాంతి సంబరాల్లో కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్‌కు చెందిన తెలుగు లెక్చరర్ ఏ.రాము తెలుగు సాహిత్యంలో చూపిన ప్రతిభకు ఉత్తమ కవి అవార్డు సాధించారు. ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చేతుల మీదుగా ఉత్తమ కవి అవార్డును అందుకున్నారు.

లారీడ్రైవర్లు, క్లీనర్లకు రగ్గుల పంపిణీ


రగ్గులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరాజు

కాకినాడ సిటీ, జనవరి 13: సంక్రాంతి సందర్భంగా లారీ స్టాండ్ ఆవరణలో కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నడింపల్లి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వ్యాపారవేత్త వినోద్ అగర్వాల్ సహకారంతో లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లకు 1500 రగ్గులు పంపిణీ చేశారు. లోకల్ డ్రైవర్లు, 100మంది పెన్షనర్లకు నిత్యావసర వస్తువులు అందజేశారు.

కార్మికులకు దుస్తుల అందజేత

పెద్దాపురం, జనవరి 13: మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ సంక్రాంతి సందర్భంగా సుమారు 47 మంది పారిశుధ్య కార్మికులకు శనివారం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇనస్పెక్టర్ డి.దావీదురాజు, కౌన్సిలర్ అరెళ్ల వీర్రాఘవరావు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

కిర్లంపూడి, జనవరి 13: మండలంలోని చిల్లంగి గ్రామంలో శనివారం చెప్పుల బాబురావు 27వ వర్ధంతిని పురస్కరించుకునిఆయన సతీమణి రోహిణీకుమారి, కుమారులు చెప్పు రాజేష్,రత్నరాజుల ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశా రు. పాస్టర్ జ్యోతిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎంపీటీసీ చెప్పుల రజని విచ్చేశారు. వితంతువులు, వృద్ధులకు దుస్తులతో పాటు పండ్లు పంచారు.

జ్యోతుల నెహ్రూ పరామర్శ

జగ్గంపేట, జనవరి 13: జగ్గంపేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు మారిశెట్టి రాధా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో శనివారం ఆయన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మారిశెట్టి భద్రం, కొత్తకొండబాబు సీతారామయ్యపలువురు నాయకులున్నారు.